
# బాంబు మళ్ళీ పేలింది!!

**- వారణాసి రామకృష్ణ**



**యధావిధిగా పూర్తిగా తెల్లవారకుండానే సూర్యారావు బస్టాపుకొచ్చి నిలబడ్డాడు. రోజూ ఠంచనుగా టైంకి వచ్చే కంపెనీ బస్సు రాలేదు. కొంచెం దూరంలో తోటి ఉద్యోగులిద్దరు మాట్లాడుకుంటుంటే సూర్యారావు వెళ్ళి - "ఏంటీవేళ- బస్సు రాలేదే?" యాదగిరితో అన్నాడు.**

"మీకు తెలీదా సార్? బస్‌లో ఇయ్యాల్టినుంచి చెకింగు సురు జేస్తున్నారంట!"

"చెకింగా? దేనికీ?" సూర్యారావు ఆశ్చర్యపోతే మరో కొలీగ్ సుధాకర్- "అవున్సార్! నాకూ ఇప్పుడే యాద్గిరి చెప్తుంటే తెలిసింది! పది రోజుల క్రిందట సిటీలో బాంబులు పేలినయి కద్సార్- అందుకని బస్సెక్కేప్పుడే సెంట్రల్ సెక్యూరిటీ వాళ్ళచేత చెకింగ్ చేయిస్తున్నారంట! బహుశ చెకింగ్ వల్లే మొదటి స్టాపులోనే బస్సు బైలుదేరటం లేటయి ఉంటుంది!" చెప్పాడు.

వింటున్న సూర్యారావుకి మతిపోయింది. ఎక్కడో తంతే మూతి పళ్ళు రాలినట్టు సిటీలో బాంబులు పేలినయి కదానని నిత్యం కంపెనీ బస్సులెక్కే ఉద్యోగుల్ని చెక్ చేస్తారా? వీళ్ళేమైనా నడుములకి బాంబులు కట్టుకుని బస్సులెక్కుతారా?- సూర్యారావు అనుకుంటుండగానే బస్సొచ్చింది. బస్సు ఆగటమే ఆలస్యం అందులోంచి సాయుధగార్డు దిగి ఎక్కబోతున్న సూర్యారావుని శరీరం నలిపి నలిపి మరీ చెక్ చేశాడు. బస్ లోపల కంపెనీ ట్రాన్స్‌పోర్టు అధికారి సుధాకర్‌తో- "పాస్ చూపించండి సార్!" అడిగాడు. పాస్ మాట వినగానే సుధాకర్ తుళ్ళిపడి "పాసా?" తెల్ల మొహం వేశాడు. పాసులు ఎప్పుడో పదేళ్ళ క్రిందట జారీచేశారు. సాధారణంగా కంపెనీ ఉద్యోగుల్ని బస్‌పాస్ అడగరు. నెలనెలా జీతంలో ఆటోమేటిగ్గా ట్రాన్స్‌పోర్టు కటింగ్ అవుతుంటుంది. అందుకని సుధాకర్ పాస్ పేరు వినగానే పరీక్షలు ఫెయిలయినట్టు మొహం పెట్టేడు. ట్రాన్స్‌పోర్టు అధికారి కొంచెం స్వరం పెంచి తీవ్రంగా "రేపట్నించి పాస్ చూపించకపోతే మధ్యలోనే దించేస్తాం సార్!"అనేసి సూర్యారావు దగ్గరికొచ్చి "మీ పాస్ ఏది సార్?" అడిగాడు. సూర్యారావు కంగుతిన్నా టిఫిన్ క్యారియర్ బ్యాగు అరలోంచి బోలెడు కాగితాలు బైటికి తీశాడు. లక్కీగా అందులో బస్‌పాస్ కనిపిస్తే 'అమ్మయ్య!' నిట్టూర్చి చూపించాడు. "ఓకే సార్ ఓకే!"అంటూ అతను ముందుకు నడిచాడు.

బస్‌లో అందరూ సిటీలో బాంబులు పేలాక కంపెనీలో పెద్దవుతున్న మార్పులు ఏమేం చోటుచేసుకోబోతున్నాయో వాటి గురించే మాట్లాడుకుంటున్నారు. త్వరలోనే కంపెనీ లోపలున్న క్యాంటీన్‌ని అక్కడ్నించి తీసి బైట గేటుదగ్గర ఏర్పాటుచేస్తారట. ఉద్యోగుల్ని గేట్లదగ్గర సెంట్రల్ సెక్యూరిటీ గార్డుల్నిపెట్టి చెక్ చేయిస్తారట! పైగా లోనికెళ్ళాలంటే ఎలక్ట్రానిక్ గేట్లదగ్గర స్మార్టు కార్డుల్ని స్వైప్ చేసి మరీ వెళ్ళాలిట! "మనకి యూనిఫాం ఇస్తారట! దాంతోబాటు మనమంతా విధిగా ఐడెంటిటీ కార్డుల్ని మెళ్ళో వేస్కోవాలంట!" - వెనక ఎవరో గట్టిగా చెపుతున్నారు. సూర్యారావుకి మనస్సు చివుక్కుమంది! అవును- గంగిరెద్దులకి వేషాలువేసినట్టు కంపెనీ ఉద్యోగులందరికీ ఒక రకం బట్టలు క్రప్పి పైగా మందలోంచి తప్పిపోకుండా మెళ్ళో ఐడెంటిటీ తాళ్ళు! ఐనా ఇవన్నీ ఇప్పుడు ఎందుకూ? బాంబులు పేలాయి!! అవును ఎక్కడో బాంబులు పేలతాయి. సామాన్యులు ఛస్తారు! ఇక్కడ రక్షణ చర్యల పేరిట సామాన్య ఉద్యోగుల్ని చంపుకు తింటారు. పైగా ఎంత ఖర్చు? కోట్లు ప్రజాధనం వృధా!! మరి ఇన్ని చర్యలు తీసుకుంటారే బాంబులు పేలకుండా ఉంటాయా? ఆ హామీ ఇస్తారా? ఆ భద్రత లభిస్తుందా? ఆ భరోసా దొరుకుతుందా?

> ఎక్కడో బాంబులు పేలతాయి. సామాన్యులు ఛస్తారు! ఇక్కడ రక్షణ చర్యల పేరిట సామాన్య ఉద్యోగుల్ని చంపుకుతింటారు. మరి ఇన్ని చర్యలు తీసుకుంటారే బాంబులు పేలకుండా ఉంటాయా? ఆ హామీ ఇస్తారా? ఆ భద్రత లభిస్తుందా? ఆ భరోసా దొరుకుతుందా?

బస్సు కంపెనీ ఆవరణకి వచ్చీరాగానే- బిలబిలమని సాయుధ గార్డులు బస్సు ద్వారం దగ్గరికొచ్చి నిలబడి - దిగుతున్న వాళ్ళని శిబిరంలోకి శత్రువులు దిగుతూంటే చూసినట్టు చూసి చెక్ చేసి లోనికి వదులుతున్నారు. కంపెనీ ఆవరణలో ఎన్నడూ లేనంత మంది సెక్యూరిటీ గార్డులు కనిపిస్తున్నారు. ప్రతి వాళ్ళ చేతిలో పొడవాటి గన్నులు! వాళ్ళంతా డేగ కళ్ళతో కంపెనీలోకి వెళ్తున్న ఉద్యోగుల్ని నిశితంగా పరికించి చూస్తూంటే సూర్యారావుకి నవ్వొచ్చింది. 'వారేయ్! బాబులూ! వీళ్ళల్లో ఎవ్వరూ బాంబులు పెట్టరు! అసలు నువ్వు గట్టిగా తుమ్మితే గుండాగి ఛస్తారు కొందరు! ఇంకొందరు వెనక్కి తిరిగి చూడకుండా పరుగెత్తిపోతారు భయంతో! అసలు నిజంగా పెట్టే వాళ్ళు బైటున్నారు! మీరంతా అక్కడకెళ్ళండ్రానాయనా!' గట్టిగా అరవాలనిపించింది! కొంచెం దూరంలో ఒక గార్డు ఇంత లావు ఇంతెత్తు జాగిలాన్ని నియంత్రించలేక ఇనుప చెయిన్‌ని తనవైపుకి లాక్కుంటూ సతమతమైపోతున్నాడు.

ఉన్నట్టుండి కేకలు- అరుపులు! ఎవరో ప్రాణభీతితో చేసిన ఆర్తనాదం! ఉద్యోగులంతా గుంపుగా గుమికూడితే సూర్యారావు కుతూహలంగా దగ్గరికెళ్ళాడు. సూర్యారావుకి తెలిసిన కొలీగ్- హర్నాధరావు- ఆయాసంతో రొప్పుతున్నాడు. భయంతో ఒళ్ళంతా చెమటలతో తడిసిపోయింది కళ్ళువెడల్పయి ఆందోళనతో మనిషి వగరుస్తున్నాడు. "అరెరె! ఏమైంది?" - సడెన్‌గా బీపీనో షుగర్ ప్రాబ్లెమో వచ్చిందనుకుని సూర్యారావు ప్రశ్నించాడు. గుంపులో వ్యక్తి ఎవరు- "హర్నాధరావుకి గాలి ఆడేలా పేపర్‌తో విసురుతూ-" "అబ్బే! ఏం కాలేదు సార్! ఈయనలోనికొస్తూంటే వెనక నుంచి సెక్యూరిటీవాళ్ళ కుక్క దగ్గరికొచ్చి ప్యాంటు వాసన చూసిందట! దాంతో ఈయన భయపడి పరుగుతీశాడు!" చెప్పాడు ఇంతలో ఎవరో గ్లాసుతో నీళ్ళుతెస్తే హర్నాధరావుకిచ్చారు. తర్వాత మెల్లగా లోనికి నడిపించుకుని తీసుకుపోయారు.

సూర్యారావుని మెయిన్‌గేటు దగ్గరున్న గార్డు మళ్ళీ నఖశిఖ పర్యంతం చెక్ చేసి లోనికి వదిలాడు. ఇంతలో మరో గార్డు సూర్యారావు చేతిలో ఉన్న బ్యాగు తీసుకుని ఎక్స్‌రే బ్యాగేజీ సిస్టమ్ ద్వారా చెక్ చేసి బ్యాగ్ అందించాడు. అతని ప్రక్కనున్న మరో ఉద్యోగికీ ఇలానే చేస్తే అతను కోపంతో ఉడికిపోతూ- "వీళ్ళబ్బ! రోజూ భోజనం క్యారియర్లని ఎక్స్‌రేస్‌కి ఎక్స్‌పోజ్ చేసి చెక్‌చేస్తే మన ఆరోగ్యాలేమైపోతాయి? అక్కడ నా కొడుకులెవరో బాంబులు పెట్టారని ఇక్కడ మనం క్యాన్సర్లొచ్చి ఛావాలా? ఈళ్ళమ్మ-" బండబూతులు తిడుతూ క్యారియర్ తీస్కుని పళ్ళు నూరుతూంటే సుధాకర్ వచ్చి సర్దిచెపుతూ- "ఎందుకయ్యా- అంత వర్రీ అవుతావు? మనకి తెల్వనిది ఏముందో? ఎక్కడో ఏదో జరగ్గానే ఇక్కడంతా హంగామా! నాలుగు రోజులు చేస్తారు. ఇంకా నాలుగు రోజులు అవగానే అందరూ అన్నీ మర్చిపోతారు. అంతా మళ్ళీ మామూలే!" నవ్వేడు.

"అదే- ఆకాడికి ఎందుకీ హంగామా అంతా అని??"- ఆవేశంగా అతనెళ్ళిపోయాడు. సుధాకర్ సూర్యారావుతోబాటు నడుస్తూ"- అసలు బాంబులు పెట్టడం జనం చావటం అనేది మూడునెలలకోసారి మామూలు వ్యవహారమైపోయింది! ఐతే తమాషా చూడండి సార్- ఎక్కడైతే బాంబులు పెట్టారో మళ్ళీ అదేచోట చచ్చినా బాంబుల పెట్టరు! ఐనా సర్ బోలెడు, నిఘా మాత్రం అక్కడే ఏర్పాటుచేస్తారు! మళ్ళీ ఈసారి ఇంకో ప్రాంతంలో బాంబు పేలుతుంది! దాంతో అక్కడ నిఘా-అక్కడ తనిఖీలు! హు. అంతా పుల్లయ్య వ్యవహారం సార్!" వ్యంగ్యంగా నవ్వేడు.

సుధాకర్ చెప్పింది నిజమే! పదేళ్ళ క్రిందటోసారి నక్సలైట్లుట- నిర్జన ప్రదేశంలో కంపెనీ బస్సునాపి చక్రాలకి గాలితీసేశారు. ఆ తర్వాత అదే స్పాట్‌లో మొదట మూడునెలలు పాతిక మంది పోలీసులు తర్వాత రెండు నెలలు పదిహేనుమంది, తర్వాత నెలరోజులు నలుగురు, ఆనక దాదాపు ఆరు నెలలబాటు ఇద్దరు పోలీసులు అదే ఏరియాలో కాపలా ఉండేవారు. పొద్దున్న సాయంత్రం వచ్చిపోయేటప్పుడు వాళ్ళని అక్కడ చూసినప్పుడల్లా నవ్వొచ్చేది. ఒక్కోసారి జాలివేసేది! గ్యారెంటీగా నక్సలైట్లు మళ్ళీ ఆ స్పాట్‌కి రారుగాక రారు! అయినా ఎందుకో అక్కడ కాపలా? అసలు ఎవర్ని రక్షించటానికో ఆ నిర్జన ప్రదేశంలో రక్షకభట దళం?? ఏంటో- నంగిరి చేష్టలు!!

కంపెనీలో సూర్యారావు సీరియస్‌గా పనిచేస్తుండగా- సైరన్ మోత వినిపించింది. ఉలిక్కిపడి- ఇదేంటి? వేళగానివేళ సైరన్ మోతేమిటి? అనుకుని టైం చూస్తే- పదకొండు అయింది. సూర్యారావు ఆశ్చర్యపోతుండగానే ప్రక్క సీటు శేషాచలం- "రావుగారూ- పదండి!" అన్నాడు లేచి నిలబడి.

"ఎక్కడికీ?"

"అదేంటి సార్! ఇవాళ మనమంతా కలిసి ప్రతిజ్ఞచెయ్యాలి కదా-"

"ప్రతిజ్ఞా? దేనికీ?!"

"దేనికేంటి సార్! టెర్రరిజానికి వ్యతిరేకంగా ప్లెడ్జ్ తీస్కోవాలి! పదండి!" అంటూ సెంటల్ హాల్ దగ్గరికి లాక్కుపోయాడు అప్పటికే అక్కడ ఉద్యోగులు పెద్దపెత్తున గుమికూడి గుసగుసగా మాట్లాడుకుంటున్నారు. జనరల్ మేనేజరు చేతిలో పేపర్ పట్టుకుని వచ్చి నిలబడ్డాడు. అతన్ని చూడగానే అంతా సైలెంట్ అయ్యారు. జనరల్ మేనేజరు సర్క్యులర్‌ని పైకి చదివి వినిపిస్తూ-

"మీరంతా ఇప్పుడు నేను చదివినదాన్ని వరుసగా ఫాలో అవుతూ చెపుతూ వెళ్ళాలి"- అంటూ ఆంగ్లంలో చదవసాగాడు. "భారతీయులమైన మేము మా దేశ సమగ్రతని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుతామని- ఎటువంటి ఉగ్రవాద తీవ్రవాద కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొనబోమనీ-... "ఇదీ మరీ వింతగా ఉంది! మేమెందుకు ఉగ్రవాదంలో పాల్గొంటాం సార్? అసలు నిత్యం మా పనులకి అడ్డపడి వితండవాదం చేస్తున్న అధికారులతోనే వాదించలేకపోతున్నాం! ఇక ఉగ్రవాదమా? తీవ్రవాద కార్యకలాపాలా? అయ్యోసార్! సూర్యుడు రాకముందే బైలుదేరి సూర్యాస్తమయం అయ్యాక ఇంటికెళ్తున్నాం- అసలు టైం ఎక్కడేడ్చి చచ్చిందీ? మా కార్యకలాపాలే సరిగ్గా చేస్కోలేక ఛస్తూంటే తీవ్రవాద కార్యకలాపాలా? జోకులెయ్యకండి సార్! ఈరోజుల్లో జాబ్సచేసే మొగుడూపెళ్ళాలు సంసార కార్యకలాపాల్లో పాల్గొనే టైమే ఉండట్లేదు. హలో సార్! ప్లీజ్- వెళ్లండి! మీలాంటి ఉన్నతాధికారులంతా వెళ్ళి తలాతోకాలేని ఇలాంటి ప్రోగ్రామ్స్‌ని నిర్ణయించే అత్యున్నత అధికార బృందాలకి చెప్పండి! నేర చరిత్ర ఉన్నవాళ్ళనీ, రౌడీల్ని, గూండాల్నీ, అవినీతిపరుల్ని రోజూ పోలీస్‌స్టేషన్ బైట పరేడ్‌లో నిలబెట్టినట్టు నిలబెట్టి- మన దేశానికి స్వతంత్రం ఎలా వచ్చిందో వివరించి చెప్పమనండి! ఎంత ఘర్షణ, ఎన్ని యుద్ధాలు, ఎంతమంది త్యాగాలుచేస్తే తెల్లదొరలు పారిపోయారో చెప్పండి! దోపిడీదారులు, ఉగ్రవాదులు, తీవ్రవాదులు వీళ్ళంతా విదేశీయులుకారు. స్వదేశీయులే! వీళ్ళందరికీ రోజూ పొద్దున్న సాయంత్రం దేశం గురించి చెప్పండి! ఇకపై ఎక్కడ ఉగ్రవాదిని పట్టుకున్నా వాడు ఆరునెలల్లోపు గాంధీ సిద్ధాంతాలమీద సాధికారంగా ఉపన్యాసమివ్వాల్సిందిగా తీర్పు చెప్పాలి! ఇవ్వలేకపోతే బ్రిటీషువాళ్ళు భగత్‌సింగుని ఉరితీసినట్టు వాడ్ని ఉరితీస్తామని చెప్పాలి! ఇకమీదట బాంబులు పెట్టిన తీవ్రవాది దొరకగానే వాడికి 'జనగణమణ' నేర్చుకొమ్మని చెప్పాలి! నేర్చుకోకపోతే నాలిక మీద వాతలు పెట్టాలి! చేతులమీద కాళ్ళమీద శరీరంపైన దేశభక్తి గీతాల్ని పచ్చబొట్లు పొడిపించాలి! స్వాతంత్ర్య సంగ్రామంలో దేశంకోసం మరణించిన వారి చిత్రాల్ని, బొమ్మల్ని టటూస్‌లా చిత్రించాలి! ఎవడైనా తోక జాడిస్తే వాడ్ని అండమాన్ జైలుకి తరలించి ఆ జైల్లో వీర సావర్కర్ ఎన్ని బాధలు పడ్డాడో వివరించి అన్ని బాధలూ వీడికి పెట్టాలి! దెబ్బకి క్రిమినల్స్‌లో మార్పు వస్తుంది!



బాంబులు పేలినప్పుడల్లా స్పెషల్ న్యూస్! స్పెషల్ లైవ్ టెలికాస్ట్ ఉంటుంది. చచ్చినవాళ్ళని చూపిస్తారు. చచ్చి బతికినవాళ్ళ మూతిదగ్గర మైక్ పెట్టి ఎట్లా చావలేదో చెప్పి చావమంటారు. దుర్ఘటనని పంచరంగుల్లో వర్ణించి చెప్పమంటారు. అధునాతన సాంకేతికత! ఎన్ని సదుపాయాలు!

"సూర్యారావ్! మిస్టర్ సూర్యారావ్!-"

ఉలిక్కిపడి సూర్యారావు చుట్టూ చూశాడు. ఉద్యోగులంతా వింతగా ఆశ్చర్యంగా అతన్నే చూస్తున్నారు జనరల్ మేనేజరు దగ్గరికొచ్చి. "ఏమైంది మీకు? జనగణమణ ఆలపించేప్పుడు అవరోధం కలిగే ఏ పనీ చెయ్యకూడదని మీకు తెలీదా?" ఆగ్రహంతో ఊగిపోయాడు. సూర్యారావు తెల్లమొహం పెడితే- "కమ్ టు మై క్యాబిన్!" విసురుగా వెళ్ళిపోయాడు. సూర్యారావుకి జరిగిందేమీ అర్థంకాలేదు. కానీ కొందరు ఉద్యోగులు మాత్రం "భలే చెప్పారు సార్! సూపర్ ఐడియాస్ సార్!" షేక్‌హ్యాండిచ్చి వెళ్ళిపోయారు. శేషాచలం వింతగా చూసి- "అది కాద్సార్- ఒకప్రక్క జీఎం 'ప్లీజ్ సైలెన్స్'అని అరుస్తూన్నా మరేదో మాట్లాడుతూన్నారేంటి?-" ఆశ్చర్యపోయాడు.

"జాతీయ గీతాలాపన చేసేప్పుడు నిశ్శబ్దంగా ఏకాగ్రతగా ఉండాలి! ఆ మాత్రం కామన్‌సెన్స్ లేకపోతే ఎట్లా?"- ఇంకో కొలిగ్ విసురుగా కామెంట్ చేశాడు. అందరూ వెళ్ళిపోయాక సూర్యారావు నెమ్మదిగా సీటు కొచ్చి కూర్చున్నాడు.

సాయంత్రం గేట్లోంచి బైటికెళ్తూంటే మళ్ళీ చాలాసేపు గార్డులు చెక్ చేశారు. ఒక ఉద్యోగి విసుగ్గా- "ఏం చెక్ చేస్తారయ్యా- చొక్కా ప్యాంటు విప్పి చూపించనా?" ఉడికిపోతే- ఎవరో అధికారి గట్టిగా కేక వేశాడు. సూర్యారావు స్తబ్ధుగా బస్సెక్కి కూర్చున్నాడు. గంటన్నర తర్వాత బస్సుదిగి ఇంట్లోకెళ్ళబోతూంటే- భార్య ఎదురొచ్చి- "చైతన్య కాలేజీనుండి ఇంకా రాలేదండి!" ఆందోళనగా అన్నది.

"ఇంకా రాలేదా?" సూర్యారావుకి కళ్ళు తిరుగుతున్నట్టనిపించింది.

"వాడి ఫ్రెండ్ దీపక్‌తో కలిసి బుక్ కొనటానికి వెళ్తానన్నాడు. ఐనా ఇంతసేపా?"- లోపల్నించి టీవీలో వార్తాప్రసారానికి ముందు వినిపించే సంగీతం వస్తూంటే, ఆమె హడలిపోతూ-

"ఇదేంటే? ఈవేళప్పుడు వార్తలు? కొంపదీసి మళ్ళీ బాంబులు పేలాయా? స్పెషల్ వార్తలేమో-" లోపలికి పరుగుతీసింది. సూర్యారావు వరండాలోనే కూర్చున్నాడు. స్పెషల్ వార్తలు! బాంబులు పేలినప్పుడల్లా స్పెషల్ న్యూస్! స్పెషల్ లైవ్ టెలికాస్ట్ ఉంటుంది. చచ్చినవాళ్ళని చూపిస్తారు. చచ్చి బతికినవాళ్ళ మూతిదగ్గర మైక్ పెట్టి ఎట్లా చావలేదో చెప్పి చావమంటారు. దుర్ఘటనని పంచరంగుల్లో వర్ణించి చెప్పమంటారు. అధునాతన సాంకేతికత! ఎన్ని సదుపాయాలు! పౌరజీవనంలో పెనుమార్పులు! మనిషి సుఖంకోసం అన్వేషిస్తూ ఎన్ని సదుపాయాలు సౌకర్యాలు కనుగొన్నాడు? ఇవన్నీ సుఖశాంతులిస్తున్నాయా? అసలు శాంతిగా, సుఖంగా, సౌకర్యంగా బతుకుతున్న మనిషి ఎవరు? సామాన్యుడా? అధికార్లా? నేతలా? కనీసం తీవ్రవాదులా? అవినీతిపరులా? ఎవ్వరూ కారు! మనిషి ఎవడికివాడు- లోలోపల ఒంటరిగా కుమిలిపోతున్నాడు!

"ఏమండీ-" లోపల్నించి భార్య పిలుపు- "ఇవి రోజూ టైంకి వచ్చే వార్తలేనండి! చైతన్యకోసం బైట నిలబడి అసలు టైమే తెలీలేదు! పిచ్చి మొద్దుని-"

అవును! పిచ్చి మొద్దులం! మనకి టైమ్ తెలీట్లేదు! అసలు టైం గురించి తెలుసుకునే టైం ఏది? నిత్యం ఉరుకులు-పరుగులు!! ఇంతలో అసోసియేషన్ ప్రెసిడెంటుతో కలిసి శేషాచలం రావటం చూశాడు. గబుక్కున లేచెళ్ళి ఇద్దర్నీ లోపలికి రమ్మని కూర్చోబెట్టాడు. శేషాచలం కాస్సేపు తటపటాయించి- సూర్యారావు చేతిలో కవర్ పెట్టేడు. విప్పి చూస్తే- సస్పెండ్ లెటర్ కాపీ! "జాతీయ సమగ్రతకి సమైక్యతకి తీవ్రవాదుల ముప్పు ఉన్నందున ఉద్యోగులంతా ఐకమత్యం ప్రదర్శించి విధ్వంసకర కార్యకలాపాలకి వ్యతిరేకంగా ప్రతిజ్ఞచేసి జాతీయ గీతం ఆలపించే తరుణంలో మీ ప్రవర్తన నియమావళికి అనుగుణంగా లేని కారణంగా మీమీద చర్య ఎందుకు తీసుకోకూడదో-" సూర్యారావు చేతిలోంచి కాగితం జారిపోయింది. దిగ్భ్రాంతిగా- "సార్-"అన్నాడు.

"సారీ రావ్! ఆ జీఎం క్రాక్ ఫెలో! నీకు తెలిందే ముందీ? టెర్మినేట్ చేస్తానని తెగ రెచ్చిపోతూంటే నేను చాలాసేపు నచ్చచెప్పాను! ఐనా డోంట్ వర్రీ- పది రోజుల్లో అంతా సెటిల్ చేయిస్తాను!" ప్రెసిడెంట్ చెప్పాక ఇద్దరూ వెళ్ళిపోయారు.

ఇంతలో లోపల్నించి భార్య కేక- "ఏమండీ! తొందరగా రండి! ఏదో ఫ్లాష్ న్యూసట- కొంపదీసి మళ్ళీ ఎక్కడో బాంబులు- చైతన్య ఇంకా రాలేదు. ఎక్కడున్నాడో ఏమిటో- ఏమండీ-" సూర్యారావు భార్య ఆదుర్దాగా ఆతృతగా అరుస్తూ వరండాలోకొచ్చి- భుజం కుదిపి- "ఏమండీ! పిలిచింది! అంతలోనే ఏదో అనుమానం వచ్చి "ఏమండీ!"- అరిచింది! అప్పటికి అర్థమైంది ఆమెకి- బాంబులు ఈసారి ఎక్కడో పేల లేదు. సరాసరి భర్త గుండెల్లో బ్రద్దలయ్యాయని!! ★


రచయిత చిరునామా

వారణాసి రామకృష్ణ,
110, నేతాజీ నగర్, ఇసిఐఎల్ పోస్టు,
హైదరాబాద్-62.
ఫోన్: 040-27116101.